ఫలితాలపై ఉత్కంఠ

- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ
- మరో నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతోంది. పట్టణంలో అయినా, పల్లెల్లో అయినా, ఎక్కడ చూసినా కౌంటింగ్ పైనే చర్చలు. ఇద్దరు ఒక చోట కలిస్తే చాలు విజయం ఎవరిని వరుస్తుందనే అంశంపైనే జోరుగా విశ్లేషణలు సాగుతున్నాయి. దీంతో పాటు పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై భారీగా పందేలు సాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో అంటే ఈ నెల 4వ తేదీ మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఓట్ల లెక్కింపునకు రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత సార్వత్రి ఎన్నికల పోలింగ్ 2019 ఏప్రిల్ 11న, జరిగితే ఫలితాల కోసం ఏకంగా 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈసారి నిరీక్షణ 21 రోజులే.

కౌంట్ డౌన్ ప్రారంభం

ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ మొదలైంది. కౌంటింగ్‌కు ఇక నాలుగు రోజులే గడువు ఉంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపు దాదాపు గంటలోపే ముగిసే అవకాశం ఉంది. నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని 205 ఎన్నికల బూత్‌లకు గాను లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం మరో 3 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఈ లెక్కన నియోజకవర్గంలో 205 పోలింగ్ బూత్‌లకు 14 టేబుల్స్ లెక్కిస్తే 15 రౌండ్లు లెక్కింపు జరగనుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు వెల్లడిస్తారు. నియోజకవర్గంలో 2,13,396 ఓటర్లు ఉండగా, వాటిలో 1,80,688 ఓట్లు పోలయ్యాయి. పోలైన పోస్టల్ బ్యాలెట్లు 2,013 ఉన్నాయి. అంటే మొత్తం 1,82,701 ఓట్లను లెక్కించనున్నారు. పోలింగ్ సరళిని బట్టి పోటీలో ఉన్న అధికార, విపక్షాల అభ్యర్థులు తమ అనుచరులతో కలసి గ్రామాలు, వార్డుల వారీగా తమకొచ్చే ఓట్లపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ వారిలో ఉత్కంఠ పెరుగుతోంది. మరోపక్క కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దానికితోడు పట్టణంలో అయినా, గ్రామాల్లో అయినా నలుగురు ఒకచోట చేరితే అభ్యర్థుల విజయావకాశాలపైనే విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఎవరు గెలుస్తారు? విజేతకు ఎంతవరకూ మెజారిటీ రావచ్చు? ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? పోటీలో ఉన్న రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు ఎలా ఉంటాయి? వంటి అంశాలను గంటల తరబడి చర్చించుకుంటున్నారు. ఒక్కోసారి ఈ చర్చలు కాస్త శ్రుతి మించి తీవ్ర వాగ్వాదానికి కూడా దారి తీస్తున్నాయి. అదే సమయంలో గత ఎన్నికల ఫలితాలతో పోలుస్తూ కొందరు బెట్టింగ్‌లు కూడా వేసుకుంటున్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఫలితాలు వెల్లడించే బోర్డు


ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిడదవోలు ఆర్వో వెంకటరమణ నాయక్

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు గాను 151 స్థానాల్లో వైఎస్సార్ సీపీ చారిత్రాత్మక విజయం సాధించింది. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా జి. శ్రీనివాస్ నాయుడు అఖండ విజయం సాధించారు. కనీవిని ఎరగని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ ఐదేళ్లలో గడప గడపకు చేరాయి. సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన పేద, మధ్య తరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని ఆ పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టేందుకు సిద్ధమైనట్టు పోలింగ్ సరళిని బట్టి అందుతున్న సమాచారం. ముఖ్యంగా మహిళలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమ కృతజ్ఞత చాటుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది.

పశ్చిమ డెల్టా కాలువలకు నేడు నీటి విడుదల


విజ్జేశ్వరం నుంచి పశ్చిమ ప్రధాన కాలువకు విడుదలవుతున్న గోదావరి జలాలు (ఫైల్)

నిడదవోలు: ఖరీఫ్ సాగు కోసం పశ్చిమ డెల్టా కాలువలకు శనివారం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ ఎం.దక్షిణామూర్తి శుక్రవారం తెలిపారు. వేద పండితులు నిర్ణయించిన ఉదయం 10.30 గంటల ముహూర్తాన విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి గోదావరి జలాలను కాలువలకు విడుదల చేస్తారు. అంతకుముందు ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు, గోదావరి డెల్టా శెట్టిపేట సర్కిల్ అధికారులు ప్రత్యేక పూజలు చేసి, గోదావరి మాతకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. మే నెల 10న గోదావరి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలకు నీటి విడుదలను నిలిపివేశారు. తిరిగి 21 రోజుల తరువాత పూర్తిగా నీటిని విడుదల చేయనున్నారు. కాలువలకు నీటి విడుదల సందర్భంగా విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో సుందరంగా అలంకరించారు. ఇక్కడి హెడ్ స్లూయిజ్‌కు ఉన్న గేట్లను ఎత్తి ముందుగా 500 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేస్తారు. అనంతరం దశల వారీగా నీటి విడుదలను పెంచుతామని అధికారులు పేర్కొన్నారు. కాగా డెల్టా కాలువలకు నీటి విడుదలతో నారుమడుల పనులు జోరందుకోనున్నాయి.

ట్యాంకు వాచర్‌కు ఆర్థిక సాయం

నల్లజర్ల: స్థానిక గ్రామ పంచాయతీలో ట్యాంకు వాచర్‌గా పని చేస్తున్న అంబటి ప్రసాద్‌కు ప్రమాదంలో నడుముకు దెబ్బ తగిలి మంచంపై ఉన్నాడు. విషయం తెలుసుకున్న మానవత సేవాసంస్థ మండల శాఖ శుక్రవారం అతడి వద్దకు వెళ్లి రూ.5000 ఆర్థిక సాయం అందించింది. అలాగే నల్లజర్ల సర్పంచ్ పల్లిజ్యోతి సుబ్బారావు మరో రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, కార్యదర్శి ఉప్పాడ కామేశ్వరరావు, రీజియన్ చైర్మన్ గుత్తికొండ ప్రసాద్, నీరుకొండ కేసీఆర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తామర పూలతో అమ్మవారికి అలంకరణ


అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, శరత్‌బాబు దంపతులు

ఉండ్రాజవరం: వైశాఖ మాసం శుక్రవారం సందర్భంగా పాలంగి గ్రామంలోని కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 208 తామర పువ్వులతో అలంకరించారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, శరత్‌బాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాయి వికసన, లక్ష్మి ధన్వంతరి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా ప్రభాకరరావు



దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఇన్‌చార్జి)గా ఈఓపీఆర్డీ పి. ప్రభాకరరావు నియమితులయారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన దాట్ల బాల కృష్ణంరాజు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో పి. ప్రభాకరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభాకరరావు సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

వేగేశ్వరపురంలో డ్రైన్లలో పూడికతీత


వేగేశ్వరపురంలో డ్రెయిన్ పూడిక తీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో రెండు రోజులుగా డ్రెయిన్లలో పూడిక తీత పనులు నిర్వహిస్తున్నట్టు ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు శుక్రవారం తెలిపారు. వచ్చే వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా గ్రామంలోని డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపడుతున్నారు. శుక్రవారం సర్పంచ్ పరశురామారావు ఈ పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ కూడా ఉన్నారు.

సామూహిక కుంకుమ పూజలు


విదమ్మ తల్లి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

దేవరపల్లి: రజకుల కులదైవమైన విదమ్మ తల్లి ఉత్సవాలు దేవరపల్లిలోని రజకుల వీధిలో మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నిడదవోలుకు విద్యాకానుక కిట్లు


నిడదవోలు చేరిన పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ గురుమూర్తి

నిడదవోలు రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 5,978 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్‌లు ఆయా పాఠశాలలకు అందజేస్తున్నట్టు ఎంఈఓ పి.గురుమూర్తి తెలిపారు. నిడదవోలు ప్రభుత్వ హైస్కూలులో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. సీఆర్పీలు, హెచ్ఎంల పర్యవేక్షణలో యూనిఫాం, బెల్ట్‌లు, బ్యాగ్‌లు, షూ, సాక్స్, నోట్ బుక్, పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నామని ఆయన చెప్పారు.

చురుగ్గా చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో చిన్నారుల పార్కు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ చిన్నారుల ఆట వస్తువులతో కూడిన పార్కుతో పాటు, ఓపెన్ జిమ్ నిర్మిస్తున్నారు. రుడా ఆధ్వర్యంలో రూ.కోటి నిధులతో ఈ నిర్మాణం జరుగుతోంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ చూపడంతో ఇక్కడ పార్కు ఏర్పాటవుతోంది.

పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలి

- ఎంపీపీ కేవీకే దుర్గారావు
- దేవరపల్లి మండల పరిషత్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు సూచించారు. శుక్రవారం జరిగిన దేవరపల్లి మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. యాదవోలు పీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదంటూ తరచూ ఫిర్యాదు వస్తున్నాయన్నారు. 24 గంటలూ సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలతో పీహెచ్‌సీ ఆవరణను, జెడ్పీ హైస్కూల్ ఆవరణను శుభ్రం చేయించాలని ఆయన అధికారులకు సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు సిద్ధంగా ఉంచాలని ఎంపీపీ అన్నారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని దుర్గారావు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 34 ప్రభుత్వ లే అవుట్లు ఉండగా, 10 లే అవుట్లలో మంచినీటి బోర్లు వేసినట్టు తెలిపారు. మూడు లే అవుట్లలో మోటార్లు ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. నిధులు విడుదలైన వెంటనే వాటిని చేస్తామని ప్రకటించారు. లే అవుట్లలో మంచినీటి సరఫరాకు రూ.3.14 కోట్లు మంజూరైనట్టు తెలిపారు.

ఉపాధి పనులకు 7465 మంది..

ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 9,748 ఉపాధి జాబ్ కార్డులు ఉండగా, 7,465 మంది ఉపాధి హామీ పనులకు వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 3,416 మంది కూలీలు పని చేస్తున్నట్టు చెప్పారు. పంట కాలువ, ఒక పంట కాలువ నుంచి మరొక పంట కాలువకు తవ్వకం పనులు, చెరువుల పూడిక తీత పనులు జరుగుతున్నాయని వివరించారు. సన్న చిన్నకారు రైతులకు మామిడి, జీడిమామిడి మొక్కలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఎంఈఓ అప్పారావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 74 శాతం, ప్రైవేట్ పాఠశాలలు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. నూతన విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యా కానుకలు మండల విద్యా కేంద్రానికి ఇప్పటికే చేరుకున్నాయని, పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలలకు కిట్లు అందజేస్తామని వివరించారు. 54 పాఠశాలలకు స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారి కె. కృష్ణారావు మాట్లాడుతూ విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉన్నందున తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కె.అరుణ, సుబ్బారావు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఆచార్యులు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చించారు.

ఉత్తమ అధికారిగా కృష్ణంరాజుకు మన్ననలు

- దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు
- కృష్ణంరాజుకు ఘనంగా వీడ్కోలు సన్మానం


ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజును సన్మానిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు, సిబ్బంది

దేవరపల్లి: ఉత్తమ అధికారిగా దాట్ల బాల కృష్ణంరాజు ప్రజల మన్ననలు పొందారని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. ఎంపీడీవో దాట్ల బాల కృష్ణంరాజు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ 1984లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన కృష్ణంరాజు 2023 జూన్‌లో దేవరపల్లి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టి మండల అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. కృష్ణంరాజు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అవార్డు అందించినట్టు తెలిపారు. కృష్ణంరాజును ఉద్యోగులు ఆదర్శంగా తీసుకుని పని చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణంరాజు, రమావతి దంపతులను ఎంపీపీ కేవీకే దుర్గారావు, సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలువురు ఉద్యోలు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, నాయకులు ఘనంగా సన్మానించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి


పాలంగిలో పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, సర్పంచ్ శ్రీనివాసు

ఉండ్రాజవరం: శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని పాలంగి గ్రామ సచివాలయం వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానికులు పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా పాలంగి హెల్త్ సెక్టార్ ఇన్‌చార్జ్ కాపా నాగరాజు, పాలంగి సచివాలయ కార్యదర్శి ఎండీ హసన్ జానీ మాట్లాడుతూ పొగ తాగడం వలన, పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్, గుండె వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్క శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ సిపోరా, రవీంద్ర, ఆశాలు పాల్గొన్నారు.

భానుడి తీక్షణకు జనం బేజారు


ఎండ తీవ్రతకు తాళ్లపూడిలో జన సంచారం లేని సంత మార్కెట్

తాళ్లపూడి: రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయనేది నానుడి. ఇది నిజమే అన్నట్టుగా మూడు రోజులుగా భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మే 25 నుంచి రోహిణీ కార్తె ప్రారంభమైంది. మొదటి రోజు నుంచి ఇప్పటివరకూ మండలంలో 41 నుంచి 43 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు రోజుల పాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతకు జడిసి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లపై జన సంచారం తగ్గిపోయింది. దాంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా తయారవుతున్నాయి. ఉక్కపోత వాతావరణాన్ని తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు గోదావరిలో స్నానాలు చేస్తూ సేద తీరుతున్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన మహిళలు

ట్రాన్స్‌కో ఏడీఈ హామీతో ఆందోళన విరమణ


విద్యుత్ సమస్యలపై దేవరపల్లి గ్రామస్తులతో చర్చిస్తున్న ఏడీఈ శివశంకర్

దేవరపల్లి: రోజుకు రెండు గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని, రాత్రి వేళ పూర్తిగా సరఫరా నిలిపివేస్తున్నారంటూ దేవరపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండడంతో ఇందిరమ్మ కాలనీ, చంద్రబాబు కాలనీ, బీసీ కాలనీ, వినాయకుడి వీధి, నిమ్మలపాటి వీధి ప్రాంతాల మహిళలు సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేశారు. ట్రాన్స్‌కో ఏఈ కె.కృష్ణారావును నిలదీశారు. దీంతో ఏడీఈ శివశంకర్ సబ్ స్టేషన్‌కు చేరుకుని వారితో చర్చించారు. లైన్‌మన్ వైఖరిపై ప్రజలు ఏడీఈకి ఫిర్యాదు చేశారు. ఏడీఈ శివశంకర్ స్పందించి, సమస్య ఇప్పుడే తన దృష్టికి వచ్చిందని సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. వినాయకుడి గుడి వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రెండు రోజులుగా కరెంట్ లేదని ప్రజలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని ఏడీఈ శివశంకర్ బదులిచ్చారు. అనంతరం గ్రామంలోని మూడు కాలనీలు, నిమ్మలపాటి వీధి, వినాయకుడి గుడి ప్రాంతాలను ఏడీఈ శివశంకర్, ఏఈ కృష్ణారావు, సిబ్బంది పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యపై గ్రామస్తులు ఏడీఈ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

వంటలు నాణ్యంగా, రుచిగా చేయాలి


మధ్యాహ్న భోజన తయారీదారులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ భగవతి

నల్లజర్ల: ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల్లోనే తినేలా పరిశుభ్రంగా, రుచిగా వంటలు చేయాలని ఎంఈఓ-2 భగవతి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యే మిడ్డే మీల్ మెనూకు అనుగుణంగా కుకింగ్ ఏజెన్సీలు వంటలు చేయాలన్నారు. వారానికి ఐదు రోజులు గుడ్లు, మూడు చిక్కీలు, ఇతర రుచికరమైన వంటలు అందించాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం పరుచూరి శ్రీనివాస్, సీఆర్పీలు శ్రీనివాస్, పెద్దింట్లు, సుజాత, రవి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం

కంబాలచెరువు: మైనర్లకు మోటార్ వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మైనర్లు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజులుగా మొత్తం 30 మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నామన్నారు. వారు, వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి వాహనాన్ని ఇవ్వరాదని పెద్దలకు వివరించామన్నారు. మైనర్ల నుంచి పట్టుకున్న ద్విచక్ర వాహనాలకు రూ.16 వేలు ఈ-చలాన్ రూపంలో జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ వి.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెల రోజుల పాటు ఉచిత వైద్య సేవలు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో శనివారం నుంచి జూలై ఒకటి వరకు నెల రోజుల పాటు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు ఆస్పత్రి చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. డాక్టర్స్ డే అయిన జూలై ఒకటిన వైద్య కళాశాలను ప్రారంభించి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నెల రోజులు అన్ని రకాల చికిత్సలు, మెడికల్ ప్రొసీజర్లు, సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. వైద్య పరీక్షలు, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన ఫీజుల్లో మాత్రం 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో చేసే వైద్య సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఈ పథకంలోకి రాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని సత్కరించిన డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డికి బ్రిటిష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ మేరీ వారు డాక్టరేట్‌తో గౌరవించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డిని కలసిన ఆయన పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి మా ట్లాడుతూ సామాజిక బాధ్యతతో సేవ చేసిన విశ్వేశ్వరరెడ్డికి డాక్టరేట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈయన వెంట పార్టీ లీగల్‌సెల్ స్టేట్ సెక్రటరీ గూడూరి రాధిక ఉన్నారు.